# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

11 హైదరాబాద్, సోమవారం 26 ఫిబ్రవరి 2024 VIKARABAD




సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## సంత్ సేవాలాల్ మహారాజ్‌కు ఘన నివాళి

### కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు


ఆమనగల్లు, ఫిబ్రవరి 25 : ఆమనగల్లు పట్టణంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంత్యుత్సవాలకు ఆదివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై ఘనంగా నివాళులర్పించారు. కేటీఆర్ వెంట రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఉండగా, బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చుతూ ఘన స్వాగతం పలికారు.

కార్యక్రమంలో జడ్పీటీసీలు నేనావత్ అనురాధ, ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, సురమల్ల సుభాష్, దొబ్బల బాబురావు, దొడ్డి పరమేశ్, కొమ్ము ప్రసాద్, డేరంగుల వెంకటేశ్, వరికుప్పల గణేశ్, రేపని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు చేయలేదని

## పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

కొత్తూరు, ఫిబ్రవరి 25 : భూ తగాద విషయంలో కేసు నమోదు చేయలేదని ఓ వ్యక్తి కొత్తూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేశాడు. చాకలి బాలయ్య తెలిపిన ప్రకారం.. మండలంలోని పెంజర్ల గ్రామ సర్వేనంబర్ 399లో 1.37 ఎకరాల భూమి తనకుందని.. అందులోని 38 గుంటల భూమిలో ఉన్న నేమ్ బోర్డు, బోరు మోటరు, స్టార్టర్‌ను నందిగామ సురేశ్, మామడి రాజేందర్‌రెడ్డి అనే వ్యక్తులు దొంగిలించారని ఈ నెల 17న పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు తీసుకోలేదని తెలిపాడు. ఆ భూమిని వారు ఇతరులకు విక్రయించేందుకు యత్నిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే సదరు వ్యక్తులు ఈ నెల 22న ఫిర్యాదు చేస్తే పోలీసులు తీసుకున్నారని.. ఆ భూమికి సంబంధించిన పత్రాలను తీసుకురావాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపాడు. 40 ఏండ్లుగా పొజిషన్‌లో ఉన్న తమ భూమిని లాక్కునేందుకు కుట్ర పన్నుతున్న వారిపై కేసు నమోదు చేయాలని చాకలి బాలయ్య డిమాండ్ చేశాడు.




పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న చాకలి బాలయ్య, కుటుంబ సభ్యులు




## రూ.4,298 కోట్లు

- స్వయం సహాయక సంఘాలకు రుణాలు
- ఆర్థిక అభ్యున్నతికి ఉపకరిస్తున్న బ్యాంకు రుణాలు
- ఈ ఏడాది లక్ష్యానికి మించి రుణాలు అందజేసిన గ్రామీణాభివృద్ధి శాఖ
- యూనిట్ల ఏర్పాటుతో ఉపాధి పొందుతున్న రంగారెడ్డి జిల్లా మహిళలు

రంగారెడ్డి, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : వివిధ వర్గాల మహిళలకు ఉపాధి అవకాశాలను మెండుగా కల్పించి ఆదాయ వనరుల పెంపే లక్ష్యంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకులు ఇతోధికంగా బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలను అందజేస్తున్నాయి. వివిధ యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు గత పదేండ్ల కాలంలో రూ.4,298కోట్లను అందజేశారు. రుణాలతో మహిళలు వివిధ రకాల యూనిట్లను ఏర్పాటు చేసుకుని స్వయం సమృద్ధిని సాధిస్తున్నారు. ఈ ఏడాది బ్యాంకు లింకేజీ లక్ష్యం రూ.710 కోట్లు కాగా.. ఫిబ్రవరి 15 నాటికే లక్ష్యానికి మించి రూ.715కోట్లను అందజేశారు.

**నాలుగో స్థానంలో జిల్లా..**

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో జిల్లాలో ఒక జిల్లా సమాఖ్య ఉండగా.. 21 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి. గ్రామ మహిళా సంఘాలు 788 ఉన్నాయి. జిల్లాలో ఉన్న 19,192 స్వయం సహాయక సంఘాల్లో మొత్తం 2,06,715 మంది సభ్యులు కొనసాగుతున్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా సంఘాలకు రుణాలు అందించి స్వావలంబనకు తోడ్పాటునందిస్తున్నది. 2022-23 సంవత్సరంలో 12,061 సంఘాలకు రూ.811కోట్ల రుణాలను అందజేశారు. 2023-24 సంవత్సరానికి 12,989 సంఘాలకు రూ.710కోట్ల రుణం ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా, ఈ ఏడాది ఫిబ్రవరి నాటికే గ్రామీణాభివృద్ధి శాఖ రుణ లక్ష్యాన్ని అధిగమించింది. దీంతో రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా ఈ ఏడాది నాలుగో స్థానంలో నిలిచింది. గడచిన పదేండ్లలో ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా రూ.4,298 కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అందజేసింది.

**ఆర్థిక స్వావలంబన దిశగా..**

ఏటా జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణాభివృద్ధి శాఖ రుణాలను మహిళా సంఘాలకు అందజేస్తూ వస్తున్నది. పాత సంఘాలతో పాటు కొత్తగా ఏర్పడిన సంఘాలకు సైతం బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇస్తున్నారు. రూ.50వేల నుంచి రూ.20లక్షల వరకూ రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న మహిళా సంఘాలు డెయిరీ, వ్యవసాయ సంబంధిత వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగడంతోపాటు రుణాలను సైతం సక్రమంగా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో 1.03 ఎన్‌పీఏతో జిల్లా రాష్ట్రంలో టాప్ టెన్‌లో ఉన్నది. మహిళా సంఘ సభ్యులు సకాలంలో రుణాలు చెల్లిస్తుండడంతో బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ అధికారులు

## రైల్వే స్టేషన్లలో తనిఖీలు

### అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి

### వికారాబాద్ జిల్లా ప్రజలకు ఎస్పీ కోటిరెడ్డి సూచన

వికారాబాద్, ఫిబ్రవరి 25 : బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం వికారాబాద్, తాండూరు రైల్వే స్టేషన్లను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లాప్రజలను కోరారు. ప్రజలు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. రైలులోని ప్రయాణికుల వస్తువులను బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఉన్న వస్తువులను పరిశీలించినట్లు తెలిపారు.



## ఫిబ్రవరిలో పీక్

### గణనీయంగా పెరిగిన విద్యుత్ డిమాండ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): మండుతున్న ఎండలతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచే రికార్డు స్థాయిలో ఎండల తీవ్రత ఉండటంతో అదే స్థాయిలో విద్యుత్ వినియోగం కూడా గ్రేటర్ పరిధిలో పెరిగింది. ఈనెల 8న 65 మిలియన్ల యూనిట్ల వినియోగం జరగ్గా, అదే సమయంలో గతేడాది ఫిబ్రవరి 55 మిలియన్ యూనిట్లకు మించలేదు. దీంతో ఏడాది ఫిబ్రవరి నుంచి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నదని అధికారులు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గతేడాదితో పోల్చుకుంటే జనవరిలో 9.47 శాతం, ఫిబ్రవరిలో 12.27 శాతం అధిక వినియోగం నమోదైందని తెలిపారు. 2023 ఫిబ్రవరిలో గరిష్ఠ విద్యుత్ డిమాండు 2930 మెగా వాట్లు ఉండగా, 2024 ఫిబ్రవరి 23వ తేదీ నాటికి 3174 మెగావాట్లు నమోదైంది. ఏటా వేసవిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతూనే ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యుత్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి వేసవి డిమాండును తట్టుకునేలా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకొని క్షేత్ర స్థాయిలో అదనంగా అవసరమైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డీటీఆర్‌లు, కొత్త లైన్లను ఏర్పాటు చేసే పనిలో విద్యుత్ యంత్రాంగం నిమగ్నమైంది.



గత ఏడాది జాతరకు తరలివచ్చిన జనం



పోలేపల్లిలోని ఎల్లమ్మ దేవత

## పోదాం పద జాతర

### ఈ నెల 29 నుంచి పోలేపల్లి ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

- మార్చి 1 శుక్రవారం సిడె
- శనివారం రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థాన కమిటీ

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 25 : దుద్యాల మండలంలోని పోలేపల్లి గ్రామంలో కొలువైన ఎల్లమ్మ తల్లి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29వ తేదీ గురువారం నుంచి ప్రారంభమై వచ్చే నెల 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో గ్రామ దేవతలకు నిర్వహించే జాతరలో ఇదే పెద్దది. కొలిచిన భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతూ, కోరిన కోరికలు తీర్చే దేవతగా ఎల్లమ్మ తల్లి.. ఈ ప్రాంతంలో ప్రసిద్ధి. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో, షోలాపూర్‌లో భక్తులు ఎల్లమ్మ తల్లిని ఇంటి దేవతగా కొలుస్తుంటారు. జాతరకు తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. జాతరలో ప్రధాన ఘట్టమైన సిడె కార్యక్రమం మార్చి 1వ తేదీ శుక్రవారం జరుగనున్నది. ఈ సిడెను తిలకించడానికి సుమారు లక్షన్నర మందికి పైగా భక్తులు హాజరవుతారు. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవాలయ కమిటీ చైర్మన్ ఏదుల జయరాములు, ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు కోస్గి, పరిగి, తాండూరు, నారాయణపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారు. సిడెకు, రథానికి రంగులు వేసి సిద్ధం చేశారు. ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడానికి మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి భక్తులు ఇప్పటికే అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు.

**29న పల్లకీ సేవ..**

ఈ నెల 29 గురువారం రాత్రి పల్లకీ సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పోలేపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం నుంచి అమ్మవారి ఉత్సవాన్ని పల్లకీలో ఉంచి రాత్రి ఊరేగింపుగా జాతర ప్రాంగణంలోని ప్రధాన దేవాలయానికి తీసుకురావడంతో ఉత్సవాలు అధికారికంగా ప్రారంభమవుతాయి.



అమ్మవారి ఆలయం

**మార్చి 1వ తేదీన సిడె..**

ఎల్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టం మార్చి 1వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సిడె.. ప్రత్యేకంగా తయారు చేయించిన రథం పొడవైన కట్టెకు చివరన ఉంచిన తొట్టెలలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి దేవాలయం చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణ చేయిస్తారు.

**2వ తేదీన రథోత్సవం..**

మార్చి 2వ తేదీ శనివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తారు. పూలతో అందంగా ముస్తాబు చేసిన రథంపై అమ్మవారి విగ్రహాన్ని ఉంచి జాతర మైదానంలో లాగుతారు. 3వ తేదీన ప్రత్యేక పూజలు, 4వ తేదీన పూజల అనంతరం సాయంత్రం అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.



**జాతరకు ఏర్పాట్లు పూర్తి..**

గురువారం నుంచి ఐదు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతర మైదానంలో ఉన్న అన్ని తాగునీటి బోర్లు పని చేసేలా చర్యలు తీసుకున్నాం. భక్తులకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ట్యాంకర్లు ఏర్పాటు చేస్తున్నాం. జాతర మైదానంలో చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నాం. వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశాం. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి భక్తులు సహకరించాలి.

– రాజేందర్‌రెడ్డి, ఎల్లమ్మ దేవాలయ మేనేజర్

### ఆస్తి పన్ను వసూలుకు

## చర్యలు వేగవంతం

### అధికారుల సమీక్షలలో జోనల్ కమిషనర్, డీసీలు

అబిడ్స్, ఫిబ్రవరి 25 : ఆస్తి పన్ను చెల్లింపు గడువు మార్చి 31వ తేదీ దగ్గర పడుతుండటంతో జీహెచ్ఎంసీ సర్కిల్-14 కార్యాలయ అధికారులు పన్ను వసూళ్లను వేగిరం చేశారు. ఇందులో భాగంగా లక్షకు పైగా ఆస్తి పన్ను బకాయి పడిన వారి నుంచి పన్ను వసూలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సర్కిల్ పరిధిలో అత్యధికంగా ప్రభుత్వ భవనాలు ఉండగా ఆయా భవనాల ఆస్తి పన్ను వసూలు చేసేందుకు సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే డిమాండ్ నోటీసులు జారీ చేసి స్పందించని వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందిని రంగంలోకి దింపి పన్ను వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు 90 కోట్ల టార్గెట్ విధించగా ఇప్పటికే యాభై కోట్ల వరకు ఆస్తి పన్ను వసూలు చేశారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేశ్ ధోత్రే పర్యవేక్షణలో సర్కిల్-14 డిప్యూటీ కమిషనర్ ఎస్ విద్యాధర్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బీఎల్‌వోలతో సమావేశాలు నిర్వహించి ఆస్తి పన్ను వసూలు టార్గెట్ పూర్తి చేసేందుకు పాటు పడుతున్నారు.

**నగరాభివృద్ధికి ఆస్తి పన్ను చెల్లించండి**



నగరాభివృద్ధికి ఆస్తి పన్ను బకాయి పడిన వారు అపరాధ రుసుము లేకుండా గడువు లోపు చెల్లించాలి. సర్కిల్-14 పరిధిలో ఆస్తి పన్ను బకాయి పడిన వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి గడువు లోపు ఆస్తి పన్ను చెల్లింపులు జరిగేలా చూస్తున్నాం.

–ఎస్ విద్యాధర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్

